క్లుప్తంగా

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ

శింగనమల: గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ సూచించారు. బుధవారం స్థానిక గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాలకు విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. పాఠకులకు పత్రికలు, కథల పుస్తకాలు ఉన్నాయని, వాటిని ఉపయోగించుకోవాలన్నారు. గ్రంథాలయాధికారి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం నూతన కమిటీ ఎన్నిక

తాడిపత్రిటౌన్: స్థానిక సీపీఐ కార్యాలయంలో బుధవారం ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రంగయ్య ఆధ్వర్యంలో తాడిపత్రి నియోజకవర్గ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. నియోజకవర్గ గౌరవాధ్యక్షుడిగా నాగరంగయ్య, అధ్యక్షుడిగా నారాయణరెడ్డి, ఉపాధ్యక్షులుగా నారాయణస్వామి, మోహన్‌రెడ్డి, క్రిష్ణమాచారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మద్యం, నాటుసారా ధ్వంసం



మద్యం, నాటుసారాను ధ్వంసం చేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: గుంతకల్లు రూరల్, కసాపురం, వన్‌టౌన్, సెబ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో 55 కేసుల్లో పట్టుబడిన రూ.1.8 లక్షల విలువైన మద్యం, నాటుసారాను బుధవారం పోలీసులు ధ్వంసం చేశారు. గుత్తి–గుంతకల్లు జాతీయ రహదారిపై తిమ్మాపురం వద్ద జరిగిన కార్యక్రమంలో అనంతపురం సెబ్ ఏఎస్పీ రామకృష్ణ, రూరల్ సీఐ మహేశ్వరరెడ్డి, రూరల్ ఎస్ఐ సురేష్, సెబ్ సీఐ మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

గుంతకల్లు రూరల్: జీ.కొట్టాల గ్రామంలో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణప్ప బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి హాజరవుతారని, మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు హాజరుకావాలని కోరారు.

జగనన్న చేసిన మంచిని గ్రహించండి



డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న చైర్‌పర్సన్ భవాని

గుంతకల్లుటౌన్: నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి చేసిన మంచిని గ్రహించి మరోసారి ఆయన్ను ఆశీర్వదించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని తెలిపారు. బుధవారం పట్టణంలోని 36వ వార్డు కౌన్సిలర్ కుమారి ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. చైర్‌పర్సన్ వార్డు సచివాలయ వద్ద పార్టీ జెండాను ఎగురవేసి వందనం చేశారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. జనరంజక పాలనతో యావత్ దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచిన సీఎం జగన్‌ను ఆశీర్వదించాలని అభ్యర్థించారు. అనంతరం ఆరోగ్యశ్రీ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జ్ వీరేష్, పట్టణ సచివాలయాల కన్వీనర్లు జింకల రామాంజినేయులు, ఖలీల్, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ ఖోఖో పోటీలకు విద్యార్థిని ఎంపిక



పవిత్రను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

గుంతకల్లుటౌన్: సౌత్‌జోన్ ఖోఖో పోటీలకు ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఎస్సీ విద్యార్థిని బి.పవిత్ర ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య తెలిపారు. బుధవారం కళాశాలలో పవిత్రను ప్రిన్సిపాల్ అభినందించారు. ఎస్కేయూలో నిర్వహించిన ఖోఖో జట్టు ఎంపిక పోటీల్లో పవిత్ర క్రీడానైపుణ్యాన్ని ప్రదర్శించి సౌత్‌జోన్ పోటీలకు ఎంపికైందన్నారు. ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు తమిళనాడులోని సెంట్రల్ యూనివర్సిటీలో జరిగే పోటీల్లో ఆమె పాల్గొంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ రవిశంకర్ శర్మ, పీడీ సురేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి

• ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి

గుంతకల్లు రూరల్: రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా అహర్నిశలూ కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం మల్లేనిపల్లి, దోనిముక్కల గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నైరుతిరెడ్డి, యువనేత మంజునాథ్‌రెడ్డితో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లలో ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాలు, కులమతాలకతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించిన ఘనత తమ ప్రభుత్వానిదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యానికి నాంది పలికిన ముఖ్యమంత్రి జగన్‌ను ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. ప్రజల క్షేమ సమాచారాలు, సంక్షేమ పథకాల పనితీరుపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకునే క్రమంలో భాగంగా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంతో మీ ఇళ్ల వద్దకు వచ్చామని ప్రజలకు తెలియజేశారు. సాంకేతిక సమస్య కారణంగా ఎక్కడైనా పరిష్కారం కాని సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బీవీ మాధవి, ఎంపీడీఓ వెంకటరమణప్ప, కిసాన్‌సెల్ జిల్లా కార్యదర్శి సోమిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మోహన్‌రావు, సచివాలయ మండల కన్వీనర్ గోవిందు నాయక్, మాజీ ఎంపీటీసీ జయరామిరెడ్డి, మల్లికార్జున శాస్త్రి, నాయకులు బండారు గోవిందప్ప, రాజేష్, నాగార్జున, ఎర్రిస్వామి, చంద్ర, లాల్‌మోహన్, రంగయ్య, శీన, మనోజ్, తిమ్మప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి



ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి మొక్క అందజేస్తున్న పేరం స్వర్ణలత

తాడిపత్రి: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పేరం స్వర్ణలత మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శిగా తనకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. తన ఎంపికకు సహకరించిన ఎమ్మెల్యే పెద్దారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, పేరం అమర్‌నాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజూ అంగన్‌వాడీల సమ్మె

గుత్తి: తమ సమస్యలు తీర్చాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా గుత్తిలోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద రెండో రోజు బుధవారం అంగన్‌వాడీలు ధర్నా చేపట్టారు. వీరికి సీఐటీయూ, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు మద్దతు పలికారు.

గార్లదిన్నె: ప్రభుత్వం ఐసీడీఎస్‌కు బడ్జెట్ కేటాయించాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శ్యామల కోరారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద రెండో రోజు అంగన్‌వాడీ సిబ్బంది నిరవధిక సమ్మె చేశారు.

యల్లనూరు మండల కేంద్రంలో తమ డిమాండ్ల సాధన కోసం బుధవారం రెండో రోజూ అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా కొనసాగించారు. వీరికి రైతు సంఘం, సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు.

పామిడి: స్థానిక కొత్త ఆర్టీసీ బస్టాండ్ వద్ద బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు తమ సమస్యలను పరిష్కరించాలంటూ ధర్నా చేపట్టారు. సీపీఎం సీనియర్ నేత, పీ అనిమిరెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు జయంతీ, భారతి, ప్రేమ, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

పెద్దవడుగూరు: రాష్ట్రంలోని హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా హమాలీ యూనియన్ కార్యదర్శి కృష్ణుడు కోరారు. బుధవారం మండల కేంద్రంలో హమాలీ వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హమాలీలకు ఇంటి స్థలాలు ఇవ్వడంతోపాటు పక్కా గృహాలు నిర్మించాలన్నారు. అనంతరం నూతన కమిటీ గౌరవాధ్యక్షులుగా హరిబాబు, నాగరాజు, అధ్యక్షుడిగా బొట్టు సుబ్రమణ్యం, కార్యదర్శిగా కృష్ణ, కోశాధికారి గా సదానందను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయండి

గుత్తి రూరల్: గ్రామాల్లో జగనన్న గృహాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారిణి విజయలక్ష్మి సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ చిత్రా శ్రీనివాసులుతో కలసి పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారిణి మాట్లాడుతూ ప్రతి కార్యదర్శి గ్రామాల్లో పర్యటించి లబ్ధిదారులకు అవగాహన కల్పించి గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. ఈఓఆర్డీ శివాజీరెడ్డి, కార్యదర్శులు ప్రవీణ్, ధనలక్ష్మి పాల్గొన్నారు.

సంక్షేమ సారథి జగనన్న



సమస్యలపై ఆరా తీస్తున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

తాడిపత్రి అర్బన్: రాష్ట్రాన్ని సంక్షేమం వైపు తీసుకెళుతున్న సీఎం వైఎస్.జగన్‌ను ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయులు, యువ నాయకులు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, కేతిరెడ్డి సాయి ప్రతాప్‌రెడ్డి కోరారు. బుధవారం వారు పట్టణంలోని 1, 33వ వార్డులో పర్యటించారు. ఈసందర్భంగా వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే సీఎం వైఎస్.జగన్ లక్ష్యమన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళుతున్న సీఎం వైఎస్.జగన్‌కు వచ్చే ఎన్నికల్లో తిరిగి పట్టం కట్టాలని కోరారు. వీరి వెంట నాయకులు షబ్బీర్, పేరం ప్రతాప్‌రెడ్డి, సునీల్, అలీ, వక్ఫ్‌బోర్డు కార్యదర్శి బాబా, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు ఉన్నారు.

పెద్దపప్పూరు: జగనన్నను మళ్లీ గెలిపించుకుందామని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు, యువనేత కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ప్రజలను కోరారు. మండల కేంద్రంలోని రామకోటి కాలనీలో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల అమలుపై ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని అక్కడికక్కడే పరిష్కరించారు. ఉపాధి హామీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వేమనాథరెడ్డి, ఎంపీపీ వెంకటరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ముచ్చుకోట అమర్నాథ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రామ్మూర్తి రెడ్డి, కో–ఆప్షన్ సభ్యులు హాజీ వలి, ఎంపీటీసీ మేకల సరోజ, నాయకులు అశోక్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి, నాగిరెడ్డి, రాంప్రసాద్, లక్ష్మీనారాయణ యాదవ్, జూటూరు ఎంపీటీసీ అనిల్‌కుమార్‌రెడ్డి, ధర్మాపురం సర్పంచు రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల పరిశీలన

గుత్తి రూరల్: రజాపురంలో ఉన్న డాక్టర్.బీఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలను ఎస్ఎఫ్ఐ నాయకులు బుధవారం సందర్శించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వెంకట్‌నాయక్ గురుకుల పాఠశాలకు వెళ్లి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నాయకులు కిరణ్, మనోహర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



టి.తిమ్మాపురం గ్రామస్తులతో కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి

తాడిపత్రిటౌన్: జగనన్న పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే తనయుడు, యువనేత కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని టి.తిమ్మాపురం గ్రామంలో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరుపై అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా కొనసాగించుకుందామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఓబుళరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పల్లె నాగేశ్వరరెడ్డి, నాయకులు విశ్వనాథరెడ్డి, కేశవరెడ్డి, జయరాం రెడ్డి, సోమేశ్వరరెడ్డి, టోపీ బాషా, శ్రీనివాసులు, పెద్దిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, బొజ్జయ్య, గోపాల్‌రెడ్డి, కృష్ణయ్య, నారాయణస్వామి, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



జలకళ పంపుసెట్లను అందిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రిటౌన్: రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే నియోజకవర్గంలోని పెద్దపప్పూరు, పెద్దవడుగూరు మండలాలకు చెందిన రైతులకు జలకళ పథకానికి సంబంధించిన పంపుసెట్లను అందజేశారు. పెద్దపప్పూరు మండలం బొందెలదిన్నెకు చెందిన రైతులు ఓబిరెడ్డిగారి లక్ష్మీనారాయణరెడ్డి, లక్ష్మిరెడ్డికి అలాగే పెద్దవడుగూరు మండలం భీమునిపల్లెకు చెందిన తిరుపాల్‌రెడ్డి మాట్లాడుతూ జలకళ పథకం ద్వారా పొలంలో వేసిన బోర్లలో నీరు సమృద్ధిగా వస్తోందన్నారు. ఉచితంగా బోరు వేయించడంతోపాటు విద్యుత్ కనెక్షన్, పంపుసెట్లు ఉచితంగా అందిచడం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు భాందవునిగా చరిత్రలో నిలిచిపోతారని రైతులు కొనియాడారు. పెద్దపప్పూరు మండలంలో చాగల్లు, ముచ్చుకోట రిజర్వాయర్లకు నీటితో నింపి పెద్దవడుగూరు మండలానికి కాలువ ద్వారా నీటిని తెచ్చి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి రైతులకు ఎంతో మేలు చేశారని వారు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పెద్దపప్పూరు ఎంపీపీ రామిరెడ్డి, ఉపాధి హామీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వేమనాథరెడ్డి, జేసీ సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచండి



గౌరవవందనం స్వీకరిస్తున్న డీఎస్పీ వెంకటశివారెడ్డి

పుట్లూరు: ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని డీఎస్పీ వెంకటశివారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వివాదాస్పద వ్యక్తుల వివరాలు సేకరించాలన్నారు. పేకాట, మట్కా తదితర జూదాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట సీఐ సుబ్రమణ్యం,ఎస్ఐ దిలీప్‌కుమార్ ఉన్నారు.

తప్పిన ప్రమాదం



బోల్తా పడిన ట్యాంకర్

పెద్దవడుగూరు: మండల కేంద్రంలో నీళ్ల ట్యాంకర్ బోల్తా పడిన ఘటనలో ప్రమాదం తప్పింది. వివరాలు..ట్రాక్టర్ డ్రైవర్ ఎగువపల్లి హరీష్ నీటితో పొలానికి బయలుదేరాడు. ఈక్రమంలో ట్యాంకర్ అదుపుతప్పి బోల్తాపడింది. ఘటనలో డ్రైవర్ ట్రాక్టర్‌పై నుంచి దూకి స్వల్పగాయాలతో బయటపడ్డాడు. ప్రమాదంపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

'పార్లమెంట్ ఘటన కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే'

తాడిపత్రి అర్బన్: పార్లమెంటు భవన్‌లో ఇద్దరు ఆగంతకులు చొరబడి టియర్ గ్యాస్‌ను ప్రయోగించడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యమేనని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి టి.రంగయ్య అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్‌లో ఇలాంటి ఘటన జరగడం భద్రతా వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోందన్నారు. నియోజకవర్గ అధ్యక్షుడు ఏ.నారాయణరెడ్డి, మండల కార్యదర్శి నాగరంగయ్య, నాయకులు రామాంజినేయులు, చిన్న కుళ్లాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

మట్కా నిర్వహిస్తే కఠిన చర్యలు



మట్కా నిర్వాహకులు, బీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రైనీ డీఎస్పీ హేమంత్‌కుమార్

తాడిపత్రి అర్బన్: మట్కా నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని తాడిపత్రి ట్రైనీ డీఎస్పీ హేమంత్‌కుమార్ నిర్వాహకులను హెచ్చరించారు. బుధవారం రాత్రి అర్బన్ పోలీస్ స్టేషన్‌లో మట్కా నిర్వాహకులు, బీటర్లకు ఆయన తనదైన శైలిలో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎవరైనా మట్కా జోలికి వెళితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'ఆడుదాం ఆంధ్రా' విజయవంతం చేద్దాం

యల్లనూరు: మండలంలో ఆడుదాం ఆంధ్రా పోటీలను విజయవంతం చేద్దామని ఎంపీడీఓ వీర్రాజు, ఎంఈఓలు చంద్రశేఖర్, పరమేశ్వరరెడ్డి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఆడుదాం ఆంధ్రా నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రికెట్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతాయన్నారు. క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

ఓటరు జాబితా పక్కాగా రూపొందించండి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

గుంతకల్లు: ఓటరు జాబితాను పక్కాగా రూపొందించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డీ.జగదీష్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం సీపీఐ అధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంతకల్లు నియోజకవర్గంలో డబుల్, వలస వెళ్లిన, మరణించిన వారి ఓట్లు వేలాదిగా ఉన్నాయని ఆరోపించారు. అధికారులు స్పందించి కొత్త ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా తయారు చేయాలని కోరారు. అనంతరం ఆర్డీఓ వాకా శ్రీనివాసులురెడ్డి, తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సీపీఐ నాయకులు బీ.గోవిందు, వీరభద్రస్వామి, గోపీనాథ్, మహేష్, ఎస్ఎండీ గౌస్, కుళ్లాయప్ప, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల ధర్నా

గుత్తి: 2017 పే అరియర్స్‌తో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డిపో ఎదుట బుధవారం ఆర్టీసీ కార్మికులు ధర్నా చేపట్టారు. ఎన్ఎంయూ అధ్యక్ష, కార్యదర్శులు ఎంఆర్ గోపాల్, ఎన్‌వి రాముడు, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించండి

యల్లనూరు: మండల వ్యాప్తంగా కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని డ్వామా ఏపీడీ వెంకటరత్నం కోరారు. ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలీకి పనులు కల్పించాలన్నారు. మస్టర్‌లో బినామీ పేర్లు రాస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంపీడీఓ వీర్రాజు, ఏపీఓ షబ్బీర్ బాషా, ఈసీ బబ్లూ, సిబ్బంది పాల్గొన్నారు.

17న 'తాడిపత్రి కథలు' పుస్తకావిష్కరణ

తాడిపత్రి అర్బన్: పట్టణానికి చెందిన కాశీభట్ల శ్రీనివాసశాస్త్రి కుమార్తె డాక్టర్ ఆర్.ఉమాశర్మ రచించిన 'తాడిపత్రి కథలు' పుస్తకావిష్కరణ ఈనెల 17న జరగనుంది. ఈ మేరకు వారి కుటుంబ సభ్యులు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సాయంత్రం 4గంటలకు మెయిన్ బజార్‌లోని జైనీ పెద్దరంగయ్య అచ్చమ్మ గార్ల కల్యాణమండపంలో భారత భాగవత ప్రవచన కర్త రాచకొండ జానకీరామశర్మ, ప్రముఖ రచయిత డాక్టర్ జూటూరు షరీఫ్, తెలుగు ఉపన్యాసకులు నందవరం కేశవరెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు.

కుష్టు సర్వే పక్కాగా చేయండి

గార్లదిన్నె: ఈనెల 27 నుంచి జనవరి 12 వరకు చేపట్టే కుష్టు సర్వే పక్కాగా చేయాలని ఆరోగ్య విస్తరణ అధికారి నాగేశ్వరయ్య సిబ్బందికి సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ ఆశా వర్కర్లు గ్రామాల్లో హెచ్ఐవీ లక్షణాలు ఉన్న వారిని గుర్తించి సకాలంలో చికిత్స అందించాలన్నారు.

గ్రామాల్లో 'వికసిత్ భారత్ సంకల్పయాత్ర'

తాడిపత్రిటౌన్: చుక్కలూరు, గంగాదేవిపల్లిలో బుధవారం వికసిత్‌భారత్ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు అంకాల్‌రెడ్డి, తాడిపత్రి మండల ప్రెసిడెంట్ రాంబాబు కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు.

సమ్మెలో గ్రామీణ తపాలా సిబ్బంది

శింగనమల: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రెండవ రోజూ బుధవారం పోస్టల్ సిబ్బంది సమ్మె కొనసాగించారు. బుధవారం మండలంలోని గ్రామీణ తపాలా సిబ్బంది శింగనమల పోస్టాఫీస్ వద్ద నిరసన తెలియజేశారు. తమ సమస్యలను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు అబ్దుల్ నబి, సత్యమూర్తి, కిష్టయ్య, దీపిక, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి అర్బన్: తమకు సివిల్ సర్వెంట్ హోదా ఇవ్వాలని తపాలా ఉద్యోగులు డిమాండ్ చేశారు. నిరవధిక సమ్మెలో భాగంగా బుధవారం పట్టణంలోని ప్రధాన తపాలా కార్యాలయం వద్ద సిబ్బంది నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో తాడిపత్రి, చుక్కలూరు, పెద్దపప్పూరు, పుట్లూరు, యల్లనూరుకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

పామిడి: స్థానిక పోస్టాఫీసు వద్ద బుధవారం తపాలా ఉద్యోగులు ధర్నా చేపట్టారు. నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ ఢాక్ సేవక్ యూనియన్ ఏపీ సర్కిల్ అసిస్టెంట్ సెక్రటరీ పీ నాగేంద్రబాబు, ఉద్యోగులు రాజు కుళ్లాయప్ప, ఆనంద్, వెంకట్రామిరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంచి ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థినులతో మాట్లాడుతూ డీవైఈఓ శ్రీనివాసులు

శింగనమల: పదవ తరగతిలో విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించాలని డీవైఈఓ శ్రీనివాసులు అన్నారు. బుధవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఆయన తరగతులలోకి వెళ్లి విద్యార్థుల సామర్థ్యాలను స్వయంగా పరిశీలించారు. ఇంకా బాగా చదువుకోవాలని సూచించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలకు స్కూల్ మేనేజ్‌మెంట్ కింద రూ.2 లక్షలు విడుదలయ్యాయని, పాఠశాల బెంచీలను మరమ్మతు చేయించుకోవాలని సూచించామన్నారు. ఆయన వెంట ఎంఈఓ నరసింహరాజు, ప్రధానోపాధ్యాయురాలు సుజాతమ్మ ఉన్నారు.

సంస్కృతీసంప్రదాయాలపై మక్కువ పెంచుకోవాలి

గుంతకల్లు: నేటి యువత సంస్కృతి, సంప్రదాయాల పట్ల మక్కువ పెంచుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక శంకరనందగిరి స్వామి డిగ్రీ కళాశాలలో ఎత్నిక్ డే(సంప్రదాయ, జాతి దినోత్సవం) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది సంప్రదాయాలకు అనుగుణంగా కొత్త వేషధారణలతో హాజరయ్యారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోపాల్, ఏఓ డాక్టర్ చంద్రశేఖర్, ప్రజా సంబంధాల అధికారి బసెట్టి కృష్ణయ్య, అధ్యాపకులు డాక్టర్ గోపి, శ్రావణి, డాక్టర్ సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ పీఓకు ఉత్తమ అవార్డు



జేఎన్‌టీయూ వీసీ నుంచి అవార్డు అందుకుంటున్న చిన్న పుల్లయ్య

బుక్కరాయసముద్రం: రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ చిన్న పుల్లయ్యకు ఉత్తమ అవార్డు లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ తెలిపారు. అనంతపురం జేఎన్‌టీయూ ఏటా ఎన్ఎస్ఎస్ సేవలను గుర్తించి ఉత్తమ పురస్కారం ప్రదానం చేస్తుందన్నారు. ఎస్ఆర్ఐటీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా చేసిన సేవలకు గాను చిన్న పుల్లయ్యకు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్-2023 అవార్డును జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ జింకా రంగ జనార్దన ప్రదానం చేశారన్నారు. ఈసందర్భంగా కళాశాల యాజమాన్యం చిన్న పుల్లయ్యను అభినందించింది.